
# మానస సరోవరం

— ఇ.టి.రామారావు


భర్త ప్రక్కలో వుండగానే భార్య మనసులో పరాయి పురుషుడు మెదిలాడంటే అది ఆ స్త్రీ



## రూ. 1,725/- విలువయిన కైనెటిక్ మిక్స్ బహుమతికి అర్హమైన కథ!

### మనో దౌర్బల్యమా లేక పతనానికి ప్రారంభమా?

ఈ ప్రశ్న ఇందుమతి మనసుని కుమ్మరి పురుగులా తొలుస్తూ ఆమెను తీవ్రంగా బాధిస్తున్నది.



విపరీతమైన భయాందోళనలకు గురి చేస్తున్నది.

ఎందుకిలా జరుగుతున్నది? ఈ వయసులో తనకీ మానసిక బలహీనత ఏమిటి? భర్తంటే తనకు ప్రాణం! చాలా గౌరవం! అతడికి ద్రోహం చేసే ఆలోచన తనకి ఏ కోశానా లేదు. కాని సురేంద్ర తలపులు తన మనసుని వీడడం లేదు. ఎంత నిగ్రహించుకుందామన్నా అసాధ్యమైపోతున్నది. తన మనసు మరీ ఇంత బలహీనమా? తను చేస్తున్నది ద్రోహం కాదా? పాపం కాదా?

ఇలాంటి ఆలోచనలు ఇందుమతి మనసులో కల్లోలాన్ని సృష్టిస్తూ అశాంతికి, ఆవేదనకు గురి చేస్తుండగా తట్టుకోలేకపోతున్నది ఆమె. నిద్రలేమితో, నిశ్శబ్ద రోదనలతో కాలాన్ని అతి భారంగా దొర్లిస్తున్నది. మనోహరమైన ఆమె మానస సరోవరం కల్లోల కడలిలా మారిపోయింది.

* * *

ఇందుమతికి ముప్ఫయి అయిదేళ్లంటే నమ్మటం చాలా కష్టం!

యవ్వనం ఇప్పటికీ ఆమె అణువణువునా విరబూస్తూ వుంటుంది.

పిల్లలు లేకపోవటం చేతనేమో శరీరంలో బిగువు, బింకం ఇంకా ఏ మాత్రం సడలినట్లు అగుపించవు.

పెళ్లయి పదేళ్లయింది. రమణమూర్తి ఆమెను ఇష్టపడి కోరి మరీ పెళ్ళిచేసుకున్నాడు కట్నం లేకుండా. తల్లిదండ్రులకు పెద్దకూతురు ఇందుమతి. పాతికేళ్లొచ్చినా ఆమెకు ఏ సంబంధమూ కలిసి రాకపోవటంతో తల్లిదండ్రులు చాలా కలత చెందినా ఇందుమతి మాత్రం అధైర్యపడలేదు. తన అపూర్వ అందచందాలు తనకో సలక్షణమైన భర్తని కొనితెస్తాయని ఆమె ప్రగాఢంగా విశ్వసించేది. ఆ నమ్మకం వృధా పోకుండా ఏదో మ్యారేజ్ ఫంక్షన్‌లో ఆమెను చూసిన రమణమూర్తి ఆమె వివరాలు కనుక్కొని సంప్రదించాడు. లక్షల ఆస్తిపరుడు, మంచి బిజినెస్ కలిగిన రమణమూర్తి కోరి వచ్చి తమ కూతురిని చేసుకుంటానంటే ఇందుమతి తల్లిదండ్రులు ఆశ్చర్యపడ్డారే తప్ప అభ్యంతరం చెప్పలేదు. ఇందుమతి కూడా ఆనందంగా అంగీకరించింది. ఆ విధంగా ఇందుమతి రమణమూర్తికి అర్ధాంగి అయింది. అన్నివిధాలా సంతృప్తికరమైన జీవితం ఆమెకు లభించింది. ఇంకా పిల్లలు కలగలేదన్న కొరత అప్పుడప్పుడు మనసుని బాధించినా అది పెద్ద సమస్యగా తీసుకోలేదు ఆ దంపతులు!

ఆనందంగా సాగిపోతున్న ఇందుమతి జీవితంలోకి సుడిగాలిలా ప్రవేశించాడు సురేంద్ర! అతడొక రచయిత! ఇందుమతికి మొదటి నుంచీ సాహిత్యం పట్ల ఆసక్తి. పెళ్లయింతర్వాత ఇంట్లో ఒక్కర్తే వుండవలసి రావటంతో పుస్తకాలే ఆమెకు నేస్తాలయ్యాయి. సురేంద్ర వ్రాసిన నవల ఒకటి చదవడం తటస్థించింది. స్త్రీలను చాలా చవకబారుగా, చపలచిత్తులుగా, వ్యక్తిత్వ హీనులుగా చిత్రిస్తూ సాగిన

ఆ నవల ఆమెలో ఉక్రోషాన్ని, ఆవేశాన్ని చాలా అధికంగా కలిగించింది. ఆపుకోలేక ఆ నవలను దుమ్మెత్తి పోస్తూ పబ్లిషర్స్‌కు ఘాటుగా లేఖ వ్రాసింది. వాళ్ళు ఆ ఉత్తరాన్ని సురేంద్రకు పంపించగా పదిహేనురోజుల తర్వాత అతని నుండి ఇందుమతికి రిప్లై వచ్చింది. సురేంద్ర ఉత్తరంలో ఇచ్చిన అడ్రసును బట్టి అతనుండేది తమ వూళ్లోనే అని గ్రహించింది ఇందుమతి. ఆ విధంగా అతనితో పరిచయం కలిగింది ఇందుమతికి. వాళ్ల మొదటి పరిచయంలోనే ఆమె మనసుని బలంగా ఆకట్టుకున్నాడు సురేంద్ర! అందుకు కారణం అతని మాటల సరళి, చాతుర్యం! ఆమెను చూసిన తొలిరోజు అతను మాట్లాడిన మాటలు ఆమె 'ఆడమనసు'ని అమితంగా ఆకర్షించాయి.

"మీరు వివాహితులా? అదీ పదేళ్ల క్రితం! నో! ఐ కాంట్ బిలీవ్! యవ్వన ప్రాంగణంలో ఇప్పుడిప్పుడే పాదం మోపుతున్న పరువపు బొమ్మలా వున్నారు"

తొలి పరిచయంలోనే అతడంత చనువు తీసుకొని తన అందాన్ని ఆ విధంగా వర్ణించటం ఇందుమతికి ఏదో తెలియని ఇబ్బంది అనిపించినా అంతరంగం మాత్రం ఆనందపడింది!

రోజులు గడుస్తున్నకొద్దీ సురేంద్రతో పరిచయం స్నేహంగా పరిణతి చెందింది: అయితే ఆమె మనసులో ఎలాంటి చెడు తలపులూ చోటు చేసుకునేవి కావు. అతడితో మాట్లాడుతుంటే కాలమే తెలిసేది కాదు. స్తబ్దుగా సాగిపోతున్న జీవితంలో ఒక నవచైతన్యం చోటుచేసుకున్న అనుభూతితో ఆమె మనసు పులకరించేది. ఎంతోకాలంగా పరిచయం వున్న వ్యక్తిలా సురేంద్ర ఆమెతో ఎంతో చనువుగా మెలిగేవాడు. అయితే అతడి ప్రవర్తన ఎంతో సంస్కారవంతంగా, సభ్యతాయుతంగా వుండేది.

"ఇలా అతిగా వాగుతూ వుండడమే నా బలహీనత! ఎదుటి వాళ్లు ఏమనుకుంటారో అనే విచక్షణను కూడ మర్చిపోతుంటాను. నా మాటలు మీకు ఎప్పుడైనా విసుగనిపించినా, ఇబ్బందికరం అనిపించినా నిర్మొహమాటంగా చెప్పండి! ప్లీజ్!" అనేవాడు. నిజానికి అతని మాటలు ఆమెకు ఏదో తెలియని తృప్తిని కలిగిస్తూ వుండేవి. ముఖ్యంగా తన అందాలను గురించి వర్ణించే మాటలు ఆమె మనసుని మరీ మురిపించేవి, మైమరపించేవి.

ఒకసారి మనసు బలహీనపడడం మొదలయ్యాక దాన్ని ఆపటం చాలా కష్టం! ఇందుమతి పరిస్థితి ఇదే విధంగా వుంది. తన అందాన్ని గురించి వర్ణిస్తూ అతడు చెప్పే మాటలు ఆమె మనసుని ఒక విధమైన మత్తుకు గురిచేసేవి. తను చాలా అందగత్తెనన్న విషయం ఆమెకు తెలియక కాదు. కాని ఇంకో మగాడు తన అందాన్ని ఈ విధంగా శ్లాఘించటం ఆమెకు సంతృప్తిని కలిగించేది. స్వతహాగా సురేంద్ర


బహుమతులు అందజేస్తున్నవారు:



రచయిత. మంచి భావుకుడు. ఇందుమతిని వర్ణించటంలో అతడుప యోగించే పదజాలం ఆమెకు పులకింతగా, పరవశంగా వుండేది. భర్త తన అందాన్ని ఇష్టపడి పెళ్లిచేసుకున్నా, అతడి నోటి వెంట ఇలాంటి ప్రశంసా వాక్యాలు ఎప్పుడూ వినివుండలేదు ఇందుమతి. సురేంద్ర మాటలకు ఆమె బలహీనురాలైపోవటానికి ఇదీ ఒక కారణం కావచ్చు.

"పురాణ కాలంలో శకుంతల, వరూధిని, సత్యభామ లాంటి కావ్య నాయికలను అనేకమందిని సృష్టించిన ఆ బ్రహ్మదేవుడు ఈ కలికా లంలో అందర్నీ కలిపి ఒక్కరిగా సృష్టించాలన్న ఆలోచన వచ్చి మిమ్మల్ని సృష్టించాడనుకుంటాను"

ఆమెనే తదేకంగా చూస్తూ అనేవాడు సురేంద్ర. ఆ మాటలు పలికే టప్పుడు అతని కళ్లల్లో ప్రతిఫలించే ఆరాధనా భావం, ప్రశంస ఆమె మనసుని ముప్పిరిగొనేవి. అలాంటి వాక్యాలు, వర్ణనలు పదే పదే విన్నాల్లని ఆమె హృదయం అప్రయత్నంగా ఆరాటపడేది.

ఆమె నవ్వు చాలా మనోహరంగా, సమ్మోహనంగా వుంటుంది. ఆ సంగతి ఇందుమతికీ తెలుసు. కాని సురేంద్ర ఆ నవ్వుని వర్ణించే విధానమే ఆమె మనసుని పులకింపచేసేది, గర్వంతో నింపేది.

"సాధారణంగా ఆడవాళ్ల అందమైన నవ్వుని పువ్వులతో పోలుస్తారు. కాని మీ నవ్వుతో పోల్చటానికి అర్హత వున్న పువ్వు ఈ భూమ్మీద లేదని ఖచ్చితంగా చెప్పగలను. ఏ దేవలోక పారిజాతం నేర్పింది మీ కిలా నవ్వటం?" అని అమాయకంగా అడిగేవాడు.

చిరునవ్వే ఆమె సమాధానం!

అతని మాటలు రోజులో చాలాసేపు గుర్తుకు వస్తూనే వుంటాయి ఇందు మతికి. రాత్రిళ్లు భర్త నిద్రపోయాక అతని మాటలు గుర్తుకు తెచ్చుకుంటూ కాలం గడపటం ఈ మధ్య అలవాటయిపోయింది.

ఒకరోజు హఠాత్తుగా అన్నాడు.

"మీకు గర్వం అని నాకెప్పుడూ అనిపించలేదుకాని మీరు కట్టుకునే చీరలకు మాత్రం మహా గర్వం!"

ఇందుమతికి ఒక్క క్షణం అర్థం కాలేదు అతడంటున్నదేమిటో!

అయోమయంగా చూసింది.

"ఎప్పుడూ మీ శరీరాన్ని అంటిపెట్టుకొని వుంటున్నామని కాబోలు మీ చీరలకుఆ గర్వం!"

విడమరిచి చెబుతున్న అతడి మాటలకు ఆమె ముఖం ఎర్రగా కంది పోయింది- సిగ్గుతో! చాలా చిత్రంగా ఆమెకు కోపం రాలేదు.

ఆ రాత్రి భర్త తనను దగ్గరకు తీసుకున్నప్పుడు ఆమె మనసులో సురేంద్ర మెదిలాడు. అతడన్న మాటలుమెదిలాయి. అలాంటి సమయంలో ఆమె మనసులో పరాయి పురుషుడు మెదలటం అదే మొదటిసారి. చాలా అనీజీగా అనిపించింది ఆమెకు. చాలా బాధపడింది.

ఆ తర్వాత ఎప్పుడు భర్త దగ్గరకు తీసుకున్నా చటుక్కున సురేంద్ర మనసులోకి వచ్చేవాడు. అలాగని ఇందుమతికి సురేంద్ర పట్ల మోహం, వ్యామోహం లేవు. అలాంటి వూహ కూడా ఆమె భరించలేకపో తున్నది. అయితే ఎంత నిగ్రహించుకునే ప్రయత్నం చేస్తున్నా ఆమె మనసు స్వాధీనం తప్పతున్నది.

తప్పని తెలుసు! కాని అశక్తత! మనో దౌర్బల్యం!

ఎందుకిలా తన మనసు వశం తప్పతున్నది?

సురేంద్ర పట్ల నిజంగా తనకు అలాంటి కోరిక లేదు.

భర్తను వంచించి పరాయి పురుషుడితో సంపర్కం పెట్టుకునే చపల చిత్తురాలు కాదు తను. నైతిక విలువపట్ల గౌరవం, విశ్వాసం తనలో వున్నాయి. పిల్లలు కలగలేదన్న అసంతృప్తి మనసులో ఏ మూలనో వున్నా అది అక్రమ సంబంధానికి దారితీసేటంత బలీయమైంది కాదు. భర్త తనను చాలా ప్రేమగా చూసుకుంటాడు. పరాయి పురుషుడితో శారీరక కలయిక పట్ల తనకి మోజులేదు.

కాని వీటన్నిటికీ అతీతమైన భావం ఏదో తన మనసుని డామినేట్ చేస్తూ ఆ సమయంలో సురేంద్రను జ్ఞప్తికి తెస్తున్నది. సహజంగా ఆడవాళ్ళు పొగడ్తలకు చాలా సులభంగా లొంగిపోతారని అంటారు. అలాంటి బలహీనతే తన మనసుని ప్రలోభపరుస్తూ వుందా? లేక రచయితగా అతన్ని తను అభిమానిస్తున్నది; ఒక స్నేహితుడిగా గౌరవి స్తున్నది; ఆ అభిమానం, గౌరవం అంతర్లీనంగా తనలో అతడి పట్ల కోరికను రేకెత్తిస్తున్నాయా? తనకు తెలియకుండానే తన మనసులో పిల్లలు లేరనే అసంతృప్తి చోటుచేసుకుని అతనితో సంబంధానికి తన తనువు అభిలషిస్తున్నదా?


10% డిస్కౌంట్



కైనెటిక్ ఎయిర్ కూలర్

కైనెటిక్ ఎయిర్ కూలర్లు, వాషింగ్ మెషీన్లు, కిచెన్ మెషీన్ల కొనుగోలుపై 10 శాతం తగ్గింపు పొందండి !

పాఠకుని పేరు :..................................

పూర్తి చిరునామా :..................................

..................................

మీ దగ్గరలోని కైనెటిక్ డీలర్‌కి ఈ కూపన్ అందజేయండి



కైనెటిక్ వాషింగ్ మెషిన్

ప్రత్యేక సూచన : ఈ కూపన్ వినియోగించుకున్న ప్రతి 25 మందిలో ఒకరికి లక్కీడిప్ ద్వారా కైనెటిక్ కంపెనీ నుండి సర్‌ప్రైజ్ గిఫ్ట్ అందజేయబడుతుంది. కనుక మీ పూర్తి చిరునామా మరువవద్దు.

ఆలోచనలు మనసుని ఉక్కిరి బిక్కిరి చేస్తుంటే తల నరాలు చిట్లిపోతున్నట్లు అనిపించసాగింది ఇందుమతికి!

తన మనస్థితి తనకే అసహ్యం, ఆందోళన కలిగిస్తుండగా ఆపుకోలేని దుఃఖంతో వెక్కి వెక్కి ఏడవసాగింది ఇందుమతి!

తన మానస సరోవరంలో కల్లోలానికి కారణం ఏమిటి?

ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి?

ఇందుమతికి ఈ రెండూ జవాబు దొరకని ప్రశ్నలు!

◆

# భార్యా భర్తలకు పరస్పర ప్రశంసలు– పొగడ్తలు అవసరమా!

## ఫేమస్ సైకియాట్రిస్ట్ విశ్లేషణ!

భార్య వుండగానే వేరే స్త్రీతో అక్రమసంబంధం పెట్టుకునే పురుషులు వున్నట్లే, భర్త వుండగానే వేరే మగవాడితో సంబంధం పెట్టుకున్న స్త్రీలు కూడా వున్నారు. కానీ వారి సంఖ్య చాలా తక్కువే. ముఖ్యంగా మన సంస్కృతిలో స్త్రీలకున్న కట్టుబాట్లు, అచారాలు, క్రమశిక్షణ మగవారికి లేవు. మగవాడు స్త్రీతో సంబంధం పెట్టుకున్నంత సులభంగా ఆడది మగవాడితో సంబంధం పెట్టుకోలేదు. ఒక స్త్రీ అలాంటి సంబంధాన్ని కోరుకుందంటే దానికి కారణాలు చాలా తీవ్రమైనవే వుంటాయి. సరదాకోసమో, వెరైటీకోసమో, కేవలం సెక్స్ సుఖంకోసం మాత్రమే అక్రమ సంబంధాలు పెట్టుకునే స్త్రీలు చాలా అరుదనే చెప్పాలి. భారతీయ స్త్రీ సెక్స్ కంటే, సంసారం, పిల్లలు, బరువుబాధ్యతలకే ఎక్కువ ప్రాముఖ్యమిస్తుంది.

ఈ కథలో ప్రశాంతంగా సాగిపోయే ఇందుమతి మానస సరోవరంలో కల్లోలం, ఆలజడి సృష్టించాడు సురేంద్ర. సిన్సియర్‌గా తన భర్తను కాదని వేరొక పురుషుడితో సంబంధాన్ని పెట్టుకోవాలనే తలంపు, అవసరం ఆమెకు ఏకోశానాలేదని ఆమె చెప్తకుంది. ఏ స్త్రీకైనా మాతృత్వం మధురమే! దానికోసం ఎంతో పరితపిస్తుంది. కానీ కేవలం పిల్లలకోసమే, నీతి–నియమాలను గాలికివదిలి ఇలాంటి సంబంధానికి ఒడిగట్టే తత్వం ఇందుమతిది కాకపోవచ్చు. చదువు, సంస్కారం వున్న ఇందుమతి పిల్లలకోసమే అయితే, ఆధునిక వైద్యశాస్త్రం ఆమెకు ఏదో ఒకవిధంగా సహాయపడుతుంది. అది ఆమెకు తెలియందికాదు. గతంలో 'సరిసంఖ్య' కథ విశ్లేషణ సందర్భంలో ఈ వివరాలు చెప్పడం కూడా పాఠకులకు గుర్తుండే వుంటుంది.

తన భర్త తనను ఎంతో ఇష్టపడి చేసుకున్నాడు. తనంటే అతడికి ప్రాణమే! కాని రమణమూర్తి తన మనసులో భార్యను ఆరాధించినా, ఇందుమతి ఆశించినట్లుగా బయటపడేమనిషి కాదు. అతడు సురేంద్రలాగా 'ఎక్స్‌ప్రెసివ్' కాదు. ఇదే ఇందుమతి మదిలో కల్లోలం రేపడానికి ముఖ్య కారణం. చాలామంది స్త్రీలు తమ అందచందాలను, తమలోని ప్లస్ పాయింట్స్‌ను ఇతరులు మెచ్చుకోవాలని, పొగడాలని, ఆరాధించాలని కోరుకుంటారు. ఇందుమతి ఈ కోవకు చెందిన స్త్రీయే! ఇందుమతిలోని ఈ బలహీనతను, రచయిత, భావుకుడు, మాటకారియైన సురేంద్ర గమనించాడు.

వెంటనే తన వాక్చాతుర్యంతో ఆమె మనసులో పాగా వేశాడు. ఒంటరితనంతో, తన మానసిక వీణను మీటే వ్యక్తికోసం ఎదురుచూస్తున్న ఇందుమతికి, సురేంద్ర మంచి 'మ్యుజీషియన్'గా కన్పించాడు. అతడి మాటలు ఆమెకు మత్తెక్కించి, మైమరపించే 'ట్రానిక్విలైజర్స్'లాగా అన్పించాయి. వెంటనే ఆ మాయమాటలకు 'అడిక్ట్' (బానిస) అయింది. మద్యానికి, మత్తుమందులకు అలవాటుపడిన వ్యక్తి అవి లేకపోతే ఎంత తపనపడ్తాడో, ఎంత అలజడికి గురవుతాడో–ఇందుమతి కూడా సురేంద్ర కైపెక్కించే మాటలు లేకపోతే అలాంటి మనస్థితికి గురయింది. అందుకే ఆమెలో కల్లోలం– ఆమె మానస సరోవరంలో అలజడి. ఆమె సురేంద్ర నుండి కోరుకునేది లైంగిక సుఖం కాదు – అంతకంటే ఆమె మనసుకు సంతోషాన్ని, తృప్తినిచ్చే – అతడి మాటలు, ఆరాధన.

భార్యా–భర్తలు తమ దైనందిన జీవితంలో పిల్లలను గురించో, సంపాదన గురించో, ఇంటి గురించో లేదా ఇతర కుటుంబ విషయాలను గురించో చర్చించుకోవడం మామూలే! అంతే కాని సురేంద్రలాగా కనబడినప్పుడల్లా, ఇందుమతి అందచందాలను, కట్టూ–బొట్టును, నడకను–నవ్వును పొగిడే భర్తలు సాధారణంగా వుండరు. చివరకు సురేంద్ర కూడా తన సొంత భార్య దగ్గర అలాంటి పొగడ్తలు చేయడనుకుంటాను. ఇందుమతి పరాయి స్త్రీ కాబట్టే అతడు అంత ఫ్రీగా గొప్పగా పొగడగల్గుతున్నాడు.

ఏదిఏమైనా రోటీన్‌గా, బరువుగా సాగిపోయే చాలామంది దంపతుల జీవితాల్లో – అవకాశమున్నప్పుడల్లా, కనీసం బెడ్‌రూములోనైనా తమ మాటలద్వారా, చేతలద్వారా ఒకరిపై ఒకరికున్న ప్రేమను–ఆరాధనను 'ఎక్స్‌ప్రెస్' చేసుకోగల్గాలి. అప్పుడే రొటీన్‌గా సాగిపోయే వారి యాంత్రిక జీవితాలకు ఒక ఆనందం, ఒక థ్రిల్, ఒక చేంజ్. భార్య–భర్తను ఎంత ప్రేమించినా – భర్త–భార్యను ఎంత ప్రేమించినా అది మనసులో దాచుకోవడంతోనే ఇందుమతిలాంటి వ్యక్తులకు రుచించకపోవచ్చు. 'Expressing out... is more important than feeling and keeping to our selves' అన్నది చాలా అవసరం అని ఇందుమతి కథ మనకు చెప్తుంది.


డా॥ ఇండ్ల రామసుబ్బారెడ్డి



ఎమ్.డి. (సైకియాట్రీ) డి.పి.ఎమ్. (నిమ్‌హాన్స్)

ఎఫ్.ఐ.పి.ఎస్. సైకియాట్రిస్ట్

ఫోన్: 77040 (హా) 64838 (ఇల్లు)

'ప్రశాంతి' విష్ణువర్ధనరావు వీధి, సూర్యారావుపేట, విజయవాడ–2